## క్లుప్తంగా

### నేటి నుంచి నష్టపరిహారం చెక్కుల పంపిణీ

నార్కట్‌పల్లి : ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలో భాగంగా కాలువల తవ్వకాల్లో భూములు కోల్పోయిన 443 మంది రైతులకు శనివారం నుంచి నష్టపరిహారం చెల్లించనున్నట్లు తహసీల్దార్ పులి సైదులు తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కింద భూములు కోల్పోయిన రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి నష్టపరిహారం చెక్కులు తీసుకోవాలన్నారు.

### యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లేష్‌యాదవ్

నల్లగొండ టౌన్ : బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మునుగోడు నియోజకవర్గానికి చెందిన నెరటి మల్లేష్‌యాదవ్ నియమితులయ్యారు. మల్లేష్‌యాదవ్‌కు శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్న జిల్లా కేంద్రలో నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దులు, మాదగోని నరేందర్‌గౌడ్, గుర్రాల పరమేష్, గోపీనాథ్ పాల్గొన్నారు.

### యాదవ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా అశోక్

చిట్యాల : యాదవ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడుగా చిట్యాల పట్టణంలోని ముత్యాలమ్మగూడెంకు చెందిన కోసనం అశోక్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల యాదన్నయాదవ్ శుక్రవారం అశోక్‌యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

### ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా వీసం సుందర్

మర్రిగూడ : మండల పరిధిలోని సరంపేట గ్రామానికి చెందిన వీసం సుందర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నాగారి ప్రీతం, జిల్లా అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి పాల్వాయి స్రవంతికి కృతజ్ఞతలు తెలిపారు.

### వైద్య సిబ్బంది ప్రత్యేక పూజలు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న ఆలయంలో శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అరుంధతి, వైద్య సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీరాములు తదితరులు ఉన్నారు.

### ఉచిత వైద్యశిబిరం



మందులు పంపిణీ చేస్తున్న క్రిస్టఫర్

నల్లగొండ టౌన్ : పట్టణంలోని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి కాంపౌండ్‌లో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ శిబిరానికి విశేష స్పందన వచ్చిందని చర్చి అధ్యక్షుడు ఎస్ క్రిస్టఫర్ శుక్రవారం తెలిపారు. రెండు రోజులుగా 600 మందికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి మందులు కూడా పంపిణీ చేశామని పేర్కొన్నారు. అనంతరం వైద్య సేవలు అందించిన డాక్టర్లను, మెడికల్ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సతీష్ చంద్రదాస్, అప్సలోమ్, మత్స్యగిరి, ఎలీషా, జయప్రకాష్, ప్రదీప్ సామ్యూల్, ప్రభు చరణ్, ఎలీషా, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న రిలే దీక్షలు

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామంలో ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అఖిలపక్ష నాయకులు దీక్షలో కూర్చోగా ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు మద్దతు పలికారు. ఈ ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### 'భట్టి' కి చెర్వుగట్టు ప్రసాదం అందజేసిన నాయకులు



ప్రసాదం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నార్కట్‌పల్లి : సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేస్తున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారానికి 100వ రోజు పూర్తయిన సందర్భంగా చెర్వుగట్టులోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి కండువా కంకణం, ప్రసాదాన్ని ఆ గ్రామ మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షుడు వారాల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ గడుసు శశిధర్‌రెడ్డిలు భట్టి విక్రమార్కకు అందజేశారు. పాదయాత్ర విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదరి శంకర్ శ్రీకాంత్, సాయి కిరణ్, నరేందర్ తదితరల ఉన్నారు.

# విచ్చలవిడిగా చెట్ల నరికివేత!

- అనుమతి లేకుండా తాటిచెట్లను తొలగిస్తున్న రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



గుండ్లోరిగూడెం గ్రామ పరిధిలో రోడ్డు పక్కన నరికివేసిన తాటి చెట్లు(ఫైల్)

మునుగోడు : గీత కార్మికులకు ఉపాధినిచ్చే తాటి చెట్లను మునుగోడు మండల వ్యాప్తంగా అడ్డగోలుగా నరికేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం హరిత హారంలో భాగంగా తాటి, ఈత చెట్లను పెంచాలని అధికారులను ఆదేశిస్తుంటే, మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రైతులు వ్యవసాయ భూముల్లోని తాటి చెట్లను విచ్చలవిడిగా నరికేసి తగులబెడుతున్నారు. దీంతో మండలవ్యాప్తంగా రోజురోజుకూ తాటి వనాల సంఖ్య భారీగా తగ్గిపోతోంది. అయినా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తాటిచెట్లను నరికే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు లేదా సామాజిక బాధ్యత గల వ్యక్తులు ఫిర్యాదు చేస్తే అధికారులు అవహేళన చేసి మాట్లాడంతోపాటు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చెట్లు నరికినవారికి మద్దతుగా నిలుస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

**అనుమతి తీసుకునే విధానం ఇలా..**

ప్రభుత్వ నిబంధన ప్రకారం రైతు లేదా ఇతర వ్యక్తులు తమ వ్యవసాయ భూమిలో తాటి చెట్లు ఉంటే వాటిని తొలగించుకునేందుకు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అందుకు ముందుగా వేయి రూపాయల డీడీ కలెక్టర్ పేరుపై తీసి ఆ డీడీతో పాటు ఒక దరఖాస్తును కలెక్టర్‌కు అందజేస్తే.. కలెక్టర్ సంబంధిత ఎక్సైజ్ అధికారులకు సూచనలు చేస్తారు. నిజంగా ఆ చెట్లను నరికివేయాల్సి వస్తే వాటిని లెక్కించి ఒక్కో చెట్టుకు అధికారులు నిర్ణయించిన నగదును డీడీ రూపంలో చెల్లిస్తే వాటిని నరికివేసేందుకు అధికారులు అనుమతి ఇస్తారు. కానీ ఇలా ఏ ఒక్కరు కూడా అనుమతి తీసుకోకుండా విచ్చలవిడిగా చెట్లను నరికేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది దాదాపు ఐదు వేలకు పైగా తాటి చెట్లను నరికేసినట్లు ఆయా గ్రామాల గీత కార్మికులు ఆరోపిస్తున్నారు.

**కేసులు నమోదు చేసింది మూడు..**

మండల వ్యాప్తంగా ఒక్కో గ్రామంలో దాదాపు 10 మంది వరకు తమ వ్యవసాయ భూముల్లోని చెట్లను నరికేశారు. మండల వ్యాప్తంగా దాదాపు 150 మందికి పైగా తాటి చెట్లను నరికేసినట్లు అంచనా. కానీ ఇప్పటివరకు అధికారులు కేవలం మూడు కేసులు మాత్రమే నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అది కూడా గ్రామస్తులు లేదా పక్కన భూమి యజమానులు ఫిర్యాదు చేస్తేనే కేసులు నమోదు చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మునుగోడు మండలంలో గీత కార్మికులకు ఉపాధి కల్పించే తాటి వనాలు తగ్గిపోకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**

తాటి చెట్లను నరికేవారిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది మునుగోడు మండలంలో రెండు, చండూరు మండలంలో ఒకటి చొప్పున కేసులు నమోదు చేశాం. ఎవరూ ఫిర్యాదు చేయకుంటే మేము సుమోటోగా కేసు నమోదు చేయలేం.

– మల్లయ్య, ఎక్సైజ్ సీఐ చండూరు

**అధికారులు పట్టించుకోవడం లేదు**



తాటి చెట్లను విచ్చలవిడిగా నరికేస్తున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మా చొల్లేడు గ్రామంలో ఒక వ్యక్తి చెట్లు నరికేస్తే చండూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశా. కేసు నమోదు చేయకపోగా అవహేళనగా మాట్లాడారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని చెట్ల నరికివేతను అరికట్టాలి.

– వనం వెంకన్న, గీత కార్మిక సంఘం మండల కార్యదర్శి

# ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నీలగిరి మున్సిపల్ కమిషనర్ రమణాచారి



హాజరైన ఉద్యోగులు

నల్లగొండ టూటౌన్ : వానాకాలం సీజన్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మున్సిపల్ ఉద్యోగులందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రమణాచారి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వార్డ్ ఆఫీసర్లు ఇతర ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డ్ ఆఫీసర్లు అందరూ వార్డు పరిధిలోని లోతట్టు ప్రాంతాల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద పారిశుద్ధ్య పనులు ఇతర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, మున్సిపల్ ఈఈ రాములు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

**పలు వార్డుల్లో కమిషనర్ పర్యటన**

వరద నీటి కాల్వ పనులను త్వరగా పూర్తి చేయాలని నల్లగొండ మున్సిపల్ కమిషనర్ రమణాచారి కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని 5వ వార్డు, 25, 32 వార్డుల్లో పర్యటించి వరద నీటి కాలువల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు రాకముందే కాలువల పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పి.గణేశ్, ఎ.ధనలక్ష్మి శ్రీనివాస్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు బి.రాములు, పి.అశోక్, బి.వెంకన్న, ఎస్.నర్సింహారెడ్డి, దిలీప్, రవీందర్, ప్రవీణ్, జి.శ్రీనివాస్, గులాంముర్తుజా, సిబ్బంది పాల్గొన్నారు.

# బ్రిడ్జీల నిర్మాణానికి నిధులు మంజూరు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని పెద్దవాగుపై రెండు బ్రిడ్జీల నిర్మాణానికి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సహకారంతో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.4 కోట్లు మంజూరయ్యాయని జెడ్పీటీసీ తరాల బలరాములుయాదవ్ తెలిపారు. నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పెద్దవాగు వద్ద శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి అంబేద్కర్‌నగర్ వెళ్లే దారిలో ఉన్న పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు రూ.2కోట్లు, స్థానిక హైస్కూల్ నుంచి నల్లగొండకు వెళ్లే దారిలో పెద్ద వాగుపై బ్రిడ్జిని నిర్మించేందుకు రూ.2 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. బ్రిడ్జీల నిర్మాణం పూర్తయితే అంబేద్కర్ నగర్, అంబటివాగు, రాంనగర్ ప్రజలకు ఇబ్బందులు తీరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఊట్కూరు ఏడుకొండలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, నాయకులు మేకల రమేష్, నమ్ముల సత్యనారాయణ, అంతటి శ్రీను, మునుగోటి ఉత్తరయ్య, రెడ్డిపల్లి మనోహర్, మేడి రాములు, వెంకన్న, కానుగు లింగయ్య, బొల్లెద్దు యాదయ్య ఉన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ బలరాములు, గ్రామస్తులు

### వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంతోపాటు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. 1948 కనీస వేతనాల చట్టం ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెరిగిన ధరల ఆధారంగా వేతనాలను సవరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఇప్పటివరకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలను సవరించలేదన్నారు. యాంత్రీకరణ కారణంగా వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బొజ్జ వెంకులు, నారి ఐలయ్య, దండెంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, పిల్లుట్ల సైదులు, రవినాయక్, కంబాలపల్లి ఆనంద్, మల్లరాములు, యాదయ్య, మారయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతులు కల్పించాలి

నకిరేకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో శుక్రవారం జరిగిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. మన ఊరు-మన బడి పథకాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను విద్యార్థులకు వెంటనే అందజేయాలన్నారు. ఈ కార్యకమంలో డివిజన్ అధ్యక్షుడు రవీందర్, సాయికుమార్ ఉన్నారు.

### మారుతి మందిరంలో కొనసాగుతున్న హోమం

నల్లగొండ రూరల్ : నల్లగొండ పట్టణంలోని ముశంపల్లి రోడ్డులో గల మారుతి మందిరంలో ఏప్రిల్ 8వ తేదీ హనుమాన్ జయంతి నుంచి ప్రతిరోజు ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు హోమం నిర్వహిస్తున్నామని ఆలయ వ్యవస్థాపకుడు త్యాగానంద స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజుకు 11 మార్లు హనుమాన్ చాలీసా పారాయనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 108 రోజుల పాటు హోమం నిర్వహించనున్నామని భక్తులు హోమంలో పాల్గొనాలని కోరారు.

# శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నకిరేకల్ : చందుపట్లలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న నాయకులు



చిట్యాల : ఉరుమడ్లలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పల్లపు బుద్ధుడు

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న, బీజేపీ మండల అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి, చెనగాని రాములు, సైదులు, లింగయ్య, నాగయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నకిరేకల్‌లో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్, నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, మండల అధ్యక్షుడు గరిషె నరేష్, లింగస్వామి, రాచకొండ శ్రీను, గరిషె శ్రీను, మైల పరమేష్, సోమనగోని నర్సింహ, అన్నెబోయిన స్వామి, సైదులు, రెడపాక రాజశేఖర్, క్లాం రమేష్ తదితరులు ఉన్నారు.

చిట్యాల : జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లపు బుద్ధుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ కోరబోయిన లింగస్వామి, ఉయ్యాల లింగస్వామిగౌడ్, రామ్‌కుమార్, ఈదుల పవన్, చింతకాయల రాము, మల్లేష్, యాదయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# శాలివాహనులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న నూనె వెంకటస్వామి

చిట్యాల : రాష్ట్ర జనాభాలో నాలుగు శాతం ఉన్న శాలివాహన(కుమ్మర) కులస్తుల సంక్షేమానికి ఎనిమిది వేల కోట్ల రూపాయల ప్రత్యేక బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన శాలివాహనుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాలివాహనులకు పది లక్షల రూపాయల రుణాన్ని వందశాతం సబ్సిడీతో అందించాలన్నారు. గ్రామ దేవతల పూజా కార్యక్రమాల్లో పాల్గొనే కుమ్మరులకు గౌరవ వేతనం అందించాలన్నారు. తాడూరి చంద్రం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అర్రూరి సత్తయ్య, వరికల్ గోపాల్, అర్రూరి కళావతి, అర్రూరి మీనమ్మ, ఖమ్మంపాటి నర్సింహ, చంద్రశేఖర్, ఊశయ్య, వెంకన్న పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మర్రిగూడ : ఖుదబాక్షపల్లి పరిధిలో గల సాయిబండతండాకు చెందిన ఆంబోతు అశోక్ కుమార్‌కు మంజూరైన రూ.50,500 విలువ గల సీఎం సహాయనిధి చెక్కును జెడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి శుక్రవారం అందజేశారు. సర్పంచ్ ఆంబోతు సుధాకర్ నాయక్, పాండు గౌడ్ పాల్గొన్నారు.

### మునుగోడులో భారీ వర్షం

మునుగోడు : మండల వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో వరుణ దేవుడి కరుణ కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి ఇప్పటికే నాటిన పత్తి మొలకెత్తుతుందని మండలంలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# రానున్న ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వండి



శాలిగౌరారం : కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



నార్కట్‌పల్లి : ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

శాలిగౌరారం : అవినీతి రహిత పాలన కోసం రానున్న సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి అవకాశం ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రవేశపెట్టి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచార కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు షేక్ సయ్యద్, చిప్పలపల్లి అంజయ్య, గంట యాదగిరి, గుండ్ల ధనుంజయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం**

నార్కట్‌పల్లి : మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సంర్భంగా బూత్ అధ్యక్షుడు పాలకూర రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల పరిపాలన పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్, పాల్వాయి భాస్కర్ రావు, లింగాల వీరయ్య, మునుకుంట్ల గణేశ్, నడింపల్లి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ మండల కమిటీ నియామకం

నల్లగొండరూరల్ : నల్లగొండ నియోజకవర్గంలోని మూడు మండలలాకు టీడీపీ మండల కమిటీలను నియమిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్వీ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా గుండు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గోగు నాగరాజు, కనగల్ మండల అధ్యక్షుడిగా దోటి సైదులు ముదిరాజ్, ప్రధానకార్యదర్శిగా మహేశ్వరం గోపాల్, నల్లగొండ మండల అధ్యక్షుడిగా పాలడుగు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా గుత్తా శంకర్ రెడ్డి, తిప్పర్తి మండల అధ్యక్షుడిగా దొంతినేని నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా కొండ జపార్ గౌడ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు.

### చేనేత కార్మికులకు అవగాహన

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో చేనేత కార్మికులకు చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చేనేత కార్మిక నాయకుడు ఇడెం కైలాసం హాజరై మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి చేనేత కార్మికుడి జీవితంలో వెలుగులు నింపారని అన్నారు. కార్మికులకు ఆర్‌డీ, నూలు, చేనేత బీమా, చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీలు పద్మ, ద్వారక, డీఓ రంజిత్, ఏడీఓ గోపాల్, ధనలక్ష్మి సంఘం అధ్యక్షుడు బావండ్ల అంజనేయులు, ధనుంజయ్, మాజీ సర్పంచ్ జగన్నాథం, వార్డు సభ్యులు అంజయ్య, నామని బుచ్చయ్య, నరేందర్, శంకరయ్య, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

# వెన్నెల కుప్పలు పుస్తకం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్త కృష్ణ కౌండిన్య

చిట్యాల : సాహిత్యంతో పిల్లల్లో మనోవికాసం పెంపొందుతుందని ప్రముఖ కవి, సాహితీవేత్త డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అన్నారు. డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్య రచించిన 'వెన్నెల కుప్పలు' పిల్లల పాటల పుస్తకాన్ని మండలంలోని వట్టిమర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం ఆ పాఠశాల పదో తరగతి విద్యార్థిని వెన్నపూసల భవ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల పూర్వ విద్యార్థి, తెలుగు ఉపాధ్యాయుడు సాగర్ల సత్తయ్య పుస్తక సమీక్ష నిర్వహించారు. హెచ్‌ఎం డోకూరి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెరుమాళ్ళ ఆనంద్, పొట్టబత్తుల రామకృష్ణ, యాదయ్య, సూర్యప్రకాష్, నీరజ, రాజు, మధుసూదన్, జయశ్రీ పాల్గొన్నారు.

# అనాథలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సోమశేఖర్

నల్లగొండ టౌన్ : ముఖ్యమంత్రి కేసీఆర్ అనాథలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట అనాథలతో కలిసి దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలను కూడా కేసీఆర్ మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బకరం శ్రీనివాస్, బోడ సునిల్, ఇరిగి శ్రీశైలం, ఆడెపు నాగార్జున, మేడి శంకర్, మడుపు శ్రీనివాస్, మచ్చ ఏడుకొండల్, మోష, వెంకటయ్య, బన్ని, శివ పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కనగల్ : మండల పరిధిలోని శేరి లింగోటం గ్రామ వాగు నుంచి అదే గ్రామానికి చెందిన గోగు లింగయ్య తన ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండడంతో శుక్రవారం పట్టుకుని కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్ల ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ● అంతటా జల్లులు



నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో కురుస్తున్న వర్షం



మునుగోడులో కురుస్తున్న వర్షం







నల్లగొండ జిల్లా కేంద్రంలో శుక్రవారం వర్షం కురుస్తున్నప్పటికీ రోడ్లపై తడుస్తూ వెళ్తున్న వాహనదారులు